క్లుప్తంగా

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు



పెద్దబిడికి సమీపంలో నాటుసారా స్థావరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

సంబేపల్లె : నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని సంబేపల్లె ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పెద్దిబిడికి సమీపంలోని నాటుసారా ఆనవాలు పరిశీలించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారు చేయడం, అమ్మడం చట్ట రీత్యా నేరమని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి ఫ్యాన్ల వితరణ

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్లకు చెందిన స్వీట్ స్టాల్ యజమాని హరిబాబు 11 సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. ఫ్యాన్లు అందజేసిన దాత, వారి కుటుంబం చేత అమ్మవారికి పూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న ఆర్గనైజేషన్ సభ్యుడు

రాయచోటి టౌన్ : ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ బ్లడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ మైనుద్దీన్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత పది సంవత్సరాల క్రితం రాయచోటి 18 మంది దాతలతో రక్తదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన తాము నేడు రెండు తెలుగు రాష్ట్రాలలో మొత్తం 30 వేల మందితో రక్తదానం చేస్తున్నామని తెలిపారు. అలాగే తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు 3 వేల యూనిట్లు రక్తదానం చేశామని చెప్పారు. అలాగే డెంగ్యూతో బాధపడుతున్న చిన్నారులకు ప్లేట్‌లెట్స్ కూడా అందిస్తూ రాయచోటిలోనే ఆదర్శవంతమైన రక్తదాతలుగా నిలిచారని చెప్పారు. కమిటీ సభ్యులు నవాజ్, అబుజర్, సమీర్, మహమ్మద్, సూఫియాన్, సందర్, బాలజీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాల అందజేత



ఆభరణాలను అందజేస్తున్న దృశ్యం

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో కొలువైన దుర్గా మాత ఆలయానికి ఆదివారం బంగారు, వెండి వస్తువులను సి.ధర్మేంద్ర అందజేశారని కమాండెంటు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా బంధు మిత్రుడైన హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌కి చెందిన శ్రీ లక్ష్మీరంగనాథ్ జువెలరీ అధినేత ధర్మేంద్ర శ్రీ దుర్గామాత అమ్మవారికి బంగారు మంగళ సూత్రం (15.770 గ్రాములు), వెండి అఖండ దీపం(83 గ్రాములు), కాలి మెట్టెలు, పట్టువస్త్రాలను కమాండెంటు సతీమణి భాగ్యలత చేతుల మీదుగా ఆయన అమ్మవారికి సమర్పించారని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు

పుల్లంపేట : కోటగడ్డపై వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

చిన్నమండెం : పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని ప్రధానోపాధ్యాయులు రెడ్డినాయక్ అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆదివారం బెస్తపల్లె గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మొక్కలు నాటి పచ్చదనం – పరిశుభ్రతకు నాంది పలికి హరితాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకనాథరెడ్డి, ఎస్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్, గ్రామ పెద్దలు చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శిగా అరుణ

గాలివీడు : అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా కార్యదర్శిగా జల్లా అరుణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. అలానే ఎస్టీ విభాగంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా రామచంద్రనాయక్, జిల్లా కార్యదర్శిగా ఎస్.ఆదినారాయణలు నియామకం అయ్యారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజంపేట వైఎస్సార్‌సీపీదే!

- మేడా సోదరుల సహకారంతోనే పోటీ
- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం
- రాజంపేట పట్టణ, గ్రామీణ నేతల ఆత్మీయ సమావేశంలో ఆకేపాటి



రాజంపేటలో జరిగిన సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు



మాట్లాడుతున్న ఆకేపాటి, పక్కన ఎమ్మెల్యే మేడా, ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : ఈ ఏడాదిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట శాసనసభ స్థానం వైఎస్సార్‌సీపీదేనని నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి స్పష్టీకరించారు. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట కళాంజలి గార్డెన్స్‌లో రాజంపేట మున్సిపాలిటీ, రూరల్ మండలానికి పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో నాకు టికెట్ రాకపోయిన సందర్భంలో బాధ వేసిందన్నారు. అప్పట్లో తనతోపాటు ఉన్న పార్టీ క్యాడర్ తీవ్రస్థాయిలో వ్యతిరేకించిందని, అయితే అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం శిరోధార్యమని వారిని సముదాయించానన్నారు. అప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడమే తన లక్ష్యంగా తీసుకున్నానన్నారు. అందుకే కలిసికట్టుగా రాజంపేటలో ఎమ్మెల్యేగా మేడాను గెలిపించుకున్నామన్నారు. ఇప్పుడు తనకు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందన్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు మేడా రఘునాథరెడ్డిల సహకారంతో పోటీ చేస్తున్నానని వెల్లడించారు. మళ్లీ రెండవసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి చేసుకోవడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. కుటుంబంలో చిన్నచిన్న తగాదాలు ఉండటం సహజమని, ఆ సమస్యలు, సానుకూలంగా కలిసి పరిష్కరించుకుంటే సమసిపోతాయన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డిలు మాట్లాడుతూ రాజంపేటలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటిని గెలిపించుకుంటే, రెండవసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకున్నవారమవుతామన్నారు. అధికారంలోకి రాగానే రాజంపేటలో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధిని పరుగులు తీయిస్తామన్నారు. ఆకేపాటితోపాటు తాము అందరికి అందుబాటులో ఉంటామని తెలియజేశారు. అందరం కలిసికట్టుగా రాజంపేటను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే బాబాయ్, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఆకేపాటి సోదరుడు అనీల్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, కబడ్డీ సంఘం జిల్లాఅధ్యక్షుడు పీసీ యోగీశ్వరరెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనరు కృష్ణారావు యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పోలి మురళీ, క్షత్రియ సంఘం నేత భాస్కర రాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, జెడ్పీటీసీ దాసరి పెంచలయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, వడ్డెర సంఘం రాష్ట్ర నేత వడ్డె రమణ, మైనార్టీ నేతలు మసూద్, గౌస్ బాషా, మహిళా నేత మిరియాల సురేఖ, కౌన్సిలర్లు, ఇన్‌చార్జ్‌లు, గ్రామీణ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు 'సిద్ధం' కావాలి



సిద్ధం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంటిమిట్ట : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు సిద్ధం కావాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, పెన్నా సిమెంట్స్ అధినేత వేణుగోపాల్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని హరిత కల్యాణ మండపంలో మండల కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేటలో పార్టీ అభ్యర్థిని గెలిపించేలా పని చేయాలన్నారు. రాష్ట్రంలో పేదలకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు సిద్ధం కావాలని తెలియజేశారు. అనంతరం సిద్ధం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా సోదరుడు మేడా రఘునాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి సోదరుడు ఆకేపాటి అనీల్ కుమార్ రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, పార్టీ సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ పనులు పూర్తి చేయండి



చిన్నఓరంపాడులో బస్ షెల్టర్ పనులను పరిశీలిస్తున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : చిన్న ఓరంపాడు అడ్డరోడ్డు వద్ద బస్‌షెల్టర్ పనులను ఆదివారం ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పరిశీలించారు. తన సొంత నిధులతో నిర్మిస్తున్న బస్ షెల్టర్ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సాయికిషోర్ రెడ్డి పరిశీలించారు. నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతుండగా స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కొర్లకుంట ఉప సర్పంచ్ ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ రమేష్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాశంకర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మధూరెడ్డి, రామ్మోహన్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గోవిందంపల్లె పంచాయతీ, శంకరాపురం దళితవాడలో వైఎస్సార్ పార్టీ నాయకులు లింగం జయరామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ. 10 వేలు మృతుని కుటుంబ సభ్యులకు అందించారు.

జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఫిబ్రవరి 8న రైతాంగ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరిని నిరసిస్తూ ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్న ఆందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అన్నమయ్య, పింఛా ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. 8న అన్ని జిల్లాల కలెక్టరేట్‌లు, ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నా, ఆందోళన కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలంటూ ఆయన పిలుపునిచ్చారు.

వసతి గృహాల సందర్శన

నందలూరు(రాజంపేట) : నందలూరు బీసీ బాలుర వసతి గృహాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడం రెడ్డి బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.గురుమూర్తిలు సందర్శించి విద్యార్థుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వసతి గృహంలో నిద్రించకుండా ఇళ్లకు వెళ్లడంతోపాటు అనేక సమస్యలు గుర్తించామన్నారు. సంబంధిత అధికారులు సమస్యల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ వేగవంతం

సిద్దవటం : మండలంలోని జగనన్న గృహాల రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందని సిద్దవటం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్ కాలనీలో లబ్ధిదారులకు ఇచ్చిన నివేశ స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. వీఆర్‌ఓలు చెన్నకేశవులు, నానిలు లబ్దిదారుల గృహాలకు రిజిస్ట్రేషన్‌లు చేయించారు.

జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ..

సిద్దవటంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వపు ఉపాధ్యాయులుతో 94-95 విద్యార్థులు

సిద్దవటం : పూర్వపు విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకోవడం సంతోషకరమని సిద్దవటం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1994 – 95 బ్యాచ్‌లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి వారు, వారి పిల్లల స్థితిగతులను వివరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య ఉండేదన్నారు. ఉపాధ్యాయుల పట్ల విద్యార్థులకు భయం, భక్తి ఉండేదన్నారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలు రాకతో విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పుల వల్ల విద్యార్థులను దండించలేని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఇంటర్‌నెట్‌లకు అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు సమాజంలో వారి పిల్లలకు క్రమశిక్షణ నేర్పించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. పూర్వపు ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, మర్రిరెడ్డి, చెన్నయ్యలు మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులను తాము కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం పూర్వపు ఉపాధ్యాయులతో పాటు స్థానిక ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములును విద్యార్థులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : ఫీజు చెల్లింపు విషయంలో విద్యార్థి తండ్రిపై వేధింపులకు పాల్పడి అతని మరణానికి కారణమైన మదనపల్లె ఎన్‌జీఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి వాసుదేవనాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థి సురేష్ ఫీజు చెల్లింపు అంశంపై అతని తండ్రిపై కళాశాల యాజమాన్యం తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడడంతో అతను గుండెపోటుతో మరణించారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కళాశాల కరస్పాండెంట్‌పై క్రిమినల్ కేసు బనాయించి అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు కుమార్ నాయక్, రవీంద్ర, ఈశ్వర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో కంటి ఆపరేషన్లు



కంటి రోగులను ఆపరేషన్లకు సిద్ధం చేస్తున్న వైద్యుడు సురేష్‌బాబు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 23 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. పట్టణ శివార్లలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఉదయం కంటి వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో 50 మంది కంటిరోగులకు కంటిపరీక్షలు నిర్వహించి వారిలో అర్హులైన 23 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్‌లు చేయించుకున్న 35మందికి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. క్లబ్ ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నామన్నారు. ఈ సేవాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ స్వరూప్ గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రాజగోపాల్‌రెడ్డితోపాటు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చేపట్టండి

పేరయ్యగారిపల్లెలో మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏడీఏ నాగరాజు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజు

సిద్దవటం : మొక్క జొన్న పంటను కత్తెర పురుగు ఆశించిందని బద్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకులు మర్రి నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని పేరయ్యగారిపల్లి, బొగ్గిడివారిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని నేకనాపురం గ్రామాల్లోని పంటలను నాగరాజు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నమోదైన ఈ – పంట వివరాలను తనిఖీ చేసి రైతులతో చర్చించి సదరు వివరాలను రికార్డు చేశారు. పేరయ్యగారిపల్లెలోని రావుల సుబ్బారెడ్డి వారి ముగ్గురు కుమారులు కలసి సర్వే నెంబర్ 332-1,332-2, 332-3, 333, 334 లో 7.24 ఎకరాల్లో మొక్క జొన్న (సింజెంట హైబ్రీడ్స్ – విత్తనోత్పత్తి)ను నవంబర్ మాసంలో సాగు చేశారన్నారు. ఇంకో నెలలో పంట కోతకు వస్తుందన్నారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించిందని, దీని నివారణకు 9 స్ప్రై నోటేరం డెలిగేట్ 0. 50 మిల్లీ లీటర్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. సదరు రైతులకు సూక్ష్మసేద్యం ద్వారా 3 ఎకరాలకు 90 శాతం సబ్సిడీ నేటాఫిం కంపెనీ డ్రిప్ పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. అలాగే నేకనాపురం గ్రామంలోని వరి పంటను పరిశీలించారు. తంగా వెంకటసుబ్బయ్య సాగు చేసిన నువ్వుల పంటను (గౌరీ రకం) విత్తడం జరిగిందన్నారు. పసుపు పంట ఇంకో నెల రోజుల్లో పంట కోతకు వస్తుందని, దిగుబడులు ఆశాజనకంగా లేదని దుంపకుళ్లు రోగంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సహాయకులు సందీప్ సింహయాదవ్, ప్రేమ్ సందీప్, రైతులు పాల్గొన్నారు.

ఓపీఎస్ పునరుద్ధరించే వారికే మద్దతు



ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పోస్టర్‌లతో ఉపాధ్యాయులు

రాయచోటి టౌన్ : పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించే వారికే మా ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓటు అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఓట్ ఫర్ ఓపీఎస్ వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగిగా జీవిత కాలం సేవలు అందించి పదవీ విరమణ అనంతరం భవిష్యత్తు భద్రత కోసం పోరాడి సాధించుకున్న పెన్షన్‌ను రద్దు చేసి సీపీఎస్, జీపీఎస్ అంటూ మా భవిష్యత్తు అంధకారంలోకి నెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పాత పెన్షన్ పద్ధతిని అమలు చేస్తామని హామీ ఇస్తారో వారికే మా ఓటు అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్ జాబీర్, ఆడిట్ కమిటీ సభ్యుడు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షులు హఫీజుల్లా, సహా అధ్యక్షులు రఫీ, చిన్నమండెం సహా అధ్యక్షులు కిఫాయతుల్లా, మండల కోశాధికారి ఆదిల్, గాలివీడు మండల నాయకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం



సర్టిఫికెట్ అందజేస్తున్న ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

రాజంపేట టౌన్ : విద్యార్థులు ఆత్మరక్షణ విద్యలను నేర్చుకోవాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. అన్నమయ్య తైక్వాండో అకాడమీ మాస్టర్ సగినాల పిచ్చయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తైక్వాండో ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు ఆకేపాటి చేతులమీదుగా కలర్ బెల్ట్, ఫస్ట్ డాన్ బెల్ట్, నేషనల్ రిఫరీ సర్టిఫికెట్ (కొరియన్)లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి క్రీడల వల్ల ఇతరులు భౌతికదాడులకు దిగినప్పుడు తమను తాము రక్షించుకునేందుకు వీలవుతుందన్నారు. అలాగే శారీరక దృఢత్వంతోపాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. అందువల్ల విద్యార్థులు విధిగా ఇలాంటి క్రీడల్లో శిక్షణ పొందాలని కోరారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ సగినాల పిచ్చయ్య, కృష్ణా లైఫ్ హాస్పిటల్ ఎండీ విన్యా, బ్రాహ్మణపల్లె సర్పంచ్ ముబారకున్నీసా బేగం, కోచ్‌లు జాహీద్ అలీ, సుధాకర్‌బాబు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు రుణ మాఫీపై ప్రకటన చేయాలి

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని రైతులు, కౌలు రైతుల రుణాల మాఫీపై ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో ఒక ప్రకటన చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు, తుపానుల వలన నష్టపోయిన రైతాంగానికి పంట నష్ట పరిహారంతోపాటు పంటల బీమా పథకం సత్వరం వర్తించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ప్రతి రైతు కుటుంబంపై రూ.2.45 లక్షల అప్పు ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పంట రుణాలను, రైతాంగ అప్పుల మాఫీపై ప్రభుత్వం ప్రకటన చేయాలన్నారు. రైతాంగానికి పంట పెట్టుబడి కింద రూ.15వేలు ఇవ్వాలన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 8న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు.

పెనగలూరు తహసీల్దార్‌కు ఘనంగా వీడ్కోలు



తహసీల్దార్‌ను సన్మానించిన అధికారులు, నాయకులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఎన్నికల బదిలీల్లో భాగంగా తహసీల్దార్ శ్రీధర్‌రావు బదిలీ అయ్యారు. ఆదివారం పెనగలూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెవెన్యూ సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఆయన్ను ఘనంగా సన్మానించి, సేవలను కొనియాడారు. అనంతరం శ్రీధర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల వైస్ ప్రెసిడెంట్ కొండూరు విజయ్ రెడ్డిల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించానన్నారు. ఇక్కడి ప్రజలు చూపిన ప్రేమను మరువలేనన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఉప సర్పంచ్ చిన్న వెంగల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేతా చక్రపాణి, సీనియర్ అసిస్టెంట్ కుమార్ స్వామి, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, వీఆర్‌ఓలు, సర్పంచ్‌లు, డీలర్లు, ఎంపీటీసీలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు



లక్కిరెడ్డిపల్లె: దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచివున్న భక్తులు



సంబేపల్లె: నల్లగంగమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



లక్కిరెడ్డిపల్లె: విశేష అలంకారంలో గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు క్యూ కట్టారు. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంధర్ రాజులు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులైన ఆదిమూలం వంశీయులు అనంతపురం గంగమ్మ దేవత దర్శనం కల్పిస్తూ అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహింపజేశారు. అనంతరం మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో..

సంబేపల్లె : మండల కేంద్రం పరిధిలోని దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇక్కడి ప్రాంతాల వాసులే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ముస్లిం భక్తులు సైతం అమ్మవారిని దర్శించుకొని రాగి అంబలి ప్రసాదాలు స్వీకరించడం విశేషం. ఆలయ నిర్మాణ కర్త, ధర్మకర్తల మండలి చైర్మన్ మునగా మురళీ స్వామి, ఈఓ కొండా రెడ్డి, నల్లగంగమ్మ స్టోన్ క్రషర్స్ యజమానులు ఉరిమి శ్రీనివాసులు, గడికోట చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు ఆలూరి శ్రీదేవి, రామచంద్ర తదితరులు భక్తులకు వసతి సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించారు.



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన మల్లూరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారికి పలు రకాల అలంకరణలు చేశారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.